క్లుప్తంగా

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ కె.విజయశేఖర్

గూడూరు: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాతంగా జరుపుకోవాలని కర్నూలు డీఎస్పీ కె.విజయశేఖర్ అన్నారు. సోమవారం గూడూరు స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించారు. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ పీరాను అడిగి స్టేషన్ వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, నేరచరిత్ర ఉన్న వారి వివరాలపై ఆరా తీశారు. అనంతరం వాల్మీకి ఆలయ ఆవరణలో స్థానికుల తో సమావేశమై వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హులైన వారందరికీ భూములు ఇవ్వాలి

ఓర్వకల్లు: గ్రామంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ భూములను ఇవ్వాలని పాలకొలను గ్రామానికి చెందిన పలువురు దళితులు, ముస్లిం మైనార్టీలు అధికారులకు విన్నవించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నిరుపేదలు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, అందులో ఏపీఐఐసీ వారికి కేటాయించారన్నారు. అయితే మాకు సెంటు పొలంలేదు, మేమంతా కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. త్వరలో జరుగబోయే అసైన్‌మెంట్ కమిటీలో పేదలకు పట్టాలు మంజూరు చేయాలని వారు కోరారు.

ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి



పెసరవాయి కేసీ కెనాల్ వద్ద రైతులతో మాట్లాడుతున్న డీఈ

గడివేముల: కేసీ కెనాల్ కింద రైతులు సాగు చేస్తున్న వరి పంటకు సాగునీరు అందించడం కష్టమని డీఈ సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పెసరవాయి వద్ద ఉన్న కేసీ కెనాల్‌కు వస్తున్న నీటిని పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ కెనాల్‌కు వచ్చే నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఇప్పటికే రైతులకు ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్పామన్నారు. రైతులు వరి పంటలను సాగు చేసుకుంటే సాగు నీరు అందించడం చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. అనంతరం కేసీ కెనాల్ కింద వేసిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు నిరంజన్‌రెడ్డి, రామ మద్దిలేటి రెడ్డి, సన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

కల్లూరు: మండలంలోని కేపీ తండా, ఉలిందకొండ, బస్తిపాడు, దూపాడు, బొల్లవరం గ్రామాలలో 500 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న భూమి లేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. సోమవారం సీపీఎం నాయకులు మధు, కృష్ణ, వెంకటస్వామి కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్ బాబుకు వినతి పత్రమిచ్చారు. వారు మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిని అసైన్‌మెంట్ కమిటీలో చేర్చి పట్టాలు మంజూరు చేయాలన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల నిలుపుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు సోమవారం డ్యాం అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో ప్రస్తుతం 0.719 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పాణ్యం : మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మంగళవారం భూమి పూజ చేయనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు గ్రామంలో నూతనంగా నిర్మించిన పీర్ల చావిడీ ప్రారంభించి, శిథిలావస్థకు చేరుకున్న మారెమ్మ ఆలయానికి పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. అలాగే గ్రామాభివృద్ధికి సంబంధించి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో చర్చిస్తారు.

అమరులకు నివాళి

ఓర్వకల్లు : బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం పార్టి మండల కార్యదర్శి నాగన్న, మధుసూదన్ అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మహేష్, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆశలు పదిలం

- 'గోరుకల్లు' కట్టకు మరమ్మతులు
- ఈ ఏడాది కూడా 6.05 టీఎంసీల పైనే నీటి నిల్వ
- అన్నదాతల్లో పెరిగిన భరోసా



గోరుకల్లు జలాశయంలో నిల్వ ఉన్న నీరు



కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

పాణ్యం : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సార్బీసీ, గాలేరుకు కేంద్ర బిందువైన గోరుకల్లు జలాశయం పనులు పూర్తి చేయడం, వర్షాలు సమృద్ధిగా కురవడంతో గత నాలుగేళ్లుగా రైతులకు సాగునీటి సమస్యలే ఎదురుకాలేదు. ఈ జలశయంలో గతేడాది పది టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంచారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరున గోరుకల్లు కట్ట రెండు చోట్ల కుంగిపోయింది. ఈ ఏడాది మరమ్మతు పనులు పూర్తి అవుతాయా లేదా అనే సందిగ్ధంలో రైతులు ఉండిపోయారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని, మరమ్మతుకు నిధులు మంజూరు చేయించి, పనులు సకాలంలో పూర్తి చేయించారు.

రూ. 92 లక్షల మంజూరు

నియోజకవర్గ పరిధిలో ఎస్సార్బీసీ ఆయకట్టు కింద 1లక్ష 92వేల ఎకరాలు సాగవుతోంది. గోరుకల్లు కట్టకు ఏప్రిల్ నెలాఖరున రెండు చోట్ల కుంగిపోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జూన్ 1వ తేదీన పత్తికొండ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాక గోరుకల్లు ప్రాముఖ్యత, ఆయకట్టు, తాగునీటి తదితర వాటిపై క్లుప్తంగా వివరించారు. మంత్రి అంబటి రాంబాబుతో కూడా మాట్లాడారు. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి రూ. 92లక్షలు మంజురు చేయించారు. ప్రత్యేక నిపుణుల కమిటీ, సీఈ సీడీఓ అధికారులు పర్యటించి పనులపై సూచనలు ఇచ్చారు. దీంతో మరమ్మతు పనులను ప్రారంభించారు.

నాణ్యతగా పనులు

గోరుకల్లు జలాశయం నీటినిల్వ పూర్తి సామర్థ్యం 12.44 టీఎంసీలు. 2016లో పనులు పూర్తి కాకుండానే అప్పటి ప్రభుత్వం మొదటిసారిగా 5 టీఎంసీల నీటిని నిల్వ చేసింది. అయితే మూడు నెలల వ్యవధిలోనే లీకేజీలు ప్రారంభమయ్యాయి. దీంతో మరమ్మతులు చేపట్టాల్సి వచ్చింది. అంలాటి సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మరమ్మతుల పనులు చేపట్టింది. కట్ట కుంగిన ప్రదేశంలో లూస్ ఎక్కడెక్కడ ఎంత లోతులో ఉన్నాయో తెలుసుకునేందుకు వారం రోజుల పాటు పరీక్షలు చేపట్టారు. లోపాలున్న చోట నిపుణుల పర్యవేక్షణలో, భారీ యంత్రాల సహాయంతో మరమ్మతు చేశారు. మూడునెలల పాటు పనులు చేపట్టి ఎట్టకేవలం నీరు వచ్చే సమయానికి రిజర్వాయర్‌ను సిద్ధం చేశారు.

యథావిధిగా నీటి నిల్వ

మరమ్మతు పనులు పూర్తి కావడంతో ఎప్పటి లాగానే ఈ సారి కూడా పది టీఎంసీల వరకు నీటి నిల్వ పెట్టవచ్చని నిపుణుల కమిటీ చెప్పింది. అయితే ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం, ఎగువ నుంచి అరకొరగా నీరు రావడంతో ఈ నెల 14వ తేదీన గోరుకల్లు నీరు వచ్చాయి. నీటిని చూసిన రైతులు కళ్లలో ఆశలు చిగురించాయి. ఇప్పటి వరకు 6.05టిఎంసీల నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేశారు. ఇన్‌ఫ్లో తగ్గుతున్న నేపథ్యంలో ఇంకా మహా అంటే ఒక టీఎంసీ రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నిపుణుల సూచనలతో పనులు



కట్ట కుంగిన విషయం ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలియడంతో ప్రభుత్వం సీఈ సీడీఓ బృందాన్ని పంపింది. మరమ్మతుల పనులకై ప్రభుత్వం రూ.92లక్షలు నిధులు మంజురు చేసింది. సీఈ ఆదేశాలు, వారి సలహాలతో పనులు పకడ్బందీగా చేశాం. ఫిల్టర్ మీడియా, శాండ్ పిల్టర్, మెటల్ ఫిల్టర్, రిప్రాప్, రివ్యూట్‌మెంట్ పనుల్లో పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మూడు నెలల వ్యవధిలో పనులు పూర్తి చేశాం. నీటి నిల్వ ఎలాంటి ఢోకా లేదు.

– ఈఈ సుభకుమార్

4న ఉప సర్పంచ్‌ల ఎన్నిక

కర్నూలు (న్యూటౌన్): వివిధ కారణాల వల్ల ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ ఉప సర్పంచు ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. కర్నూలు మండలం రేమట, దిగువపాడు గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచులను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సెప్టెంబర్ 4వ తేదీన ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసి, ఉప సర్పంచు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు వెల్లడించా రు.ఈ ఎన్నికకు సంబంధించి మూడు రోజులు ముందుగానే (ఈనెల 31వ తేదీ లోగా) ఆయా గ్రామ పంచాయతీల్లోని సర్పంచు, వార్డు సభ్యులకు సమాచారం చేరవేస్తామన్నారు. ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ

కల్లూరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అండగా ఉంటుందని కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులోని టెలికాం నగర్‌లో 51, 52, 53వ వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించి బీమా రిజిస్ట్రేషన్ చేయించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచి పనులను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపించుకొని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కుట్రపూరిత రాజకీయాలను తిప్పికొట్టండి



మాట్లాడుతున్న లోటర్‌బాషా

ఓర్వకల్లు : తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న కుట్రపూరిత రాజకీయాలను, వైఎస్సార్ సీపీ నాయకులపై చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని శకునాల గ్రామ సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. సర్పంచ్ జంగం రాధిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోటర్‌బాషా మాట్లాడుతూ.. రాబోయే 2024 ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు రాకుండా చిత్తుగా ఓడించడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందజేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సౌలభ్యం కోసం ఉచిత బీమా పథకాన్ని అమలుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సచివాలయ కన్వీనర్లు బీరం పుల్లారెడ్డి, కిరణ్‌కుమార్, గొల్ల.రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, చిత్రంలో మేయర్ రామయ్య

కల్లూరు : కర్నూలు నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. సోమవారం రాత్రి మేయర్ క్యాంపు కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులతో వార్డుల సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో పాలకవర్గం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకుంటున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్) : అత్యవసర పరిస్థితుల్లో నేను అండగా ఉన్నానని బాధితులకు భరోసానిస్తూ ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలకు భరోసానిచ్చి ఆర్థిక సాయం అందజేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో సి.బెళగల్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో, అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. పేద ప్రజల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సంపత్‌కుమార్, సుంకన్న, తులసిరెడ్డి, సొసైటీ చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన హౌసింగ్ పీడీ



ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హౌసింగ్ పీడీ సిద్ధాలింగమూర్తి

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌ను ఆయన నివాసంలో జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధాలింగమూర్తి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కోడుమూరు నియోజకవర్గంలో హౌసింగ్ పురోగతి, బిల్లుల చెల్లింపులపై తదితర అంశాలపై పీడీతో ఎమ్మెల్యే చర్చించారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని, బిల్లుల చెల్లింపులో ఏమాత్రం జాప్యం లేకుండా చూసుకోవాలని సూచించారు.

స్పందన దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు



గూడూరు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న చనుగొండ్ల వాసులు

గూడూరు: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడే పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ సిబ్బందికి సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని చనుగొండ్ల గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రంలో ఎంపీడీఓ మాధవీలత, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్, వైకేపీ ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

సి.బెళగల్: స్పందన అర్జీల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన తన తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ గోనే నాయక్, ఏఓ మల్లేష్‌కుమార్ ఉన్నారు.

డయల్ యువర్ డీఎం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని 1, 2 డిపోల బస్సులు తిరిగే పట్టణాలు, ప్రాంతాల ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు చెప్పుకొని పరిష్కారం పొందవచ్చని చె ప్పారు.రెండు డి పో ల పరిధిలోని ప్ర యా ణికులుఉద యం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో 99592 25794 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయండి



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

సి.బెళగల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని సంగాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, పాఠశాలలో జరగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల హెచ్‌ఎం సునీల్ రాజు, సీనియర్ ఉపాధ్యాయుడు బాలతిమ్మారెడ్డితో పనులపై చర్చించి, నిధుల వినియోగంపై సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులను నాణ్యతగా చేపట్టాలని, సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించి భోజనంను నాణ్యతగా వడించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఇంజనీర్ అసిస్టెంట్ నిఖిల్ ఉన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి



అడ్మిషన్లు చేయిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: ప్రభుత్వం అమలు చేస్తున్న సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్యను)సద్వియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం ఎంఆర్‌సీ కార్యాలయంలో కొత్తగా పది, ఇంటర్ చదివేందుకు అడ్మిషన్లు చేయించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో చేరాలనుకునే వారు వలంటీర్లు చేపెట్ట ఈ సర్వే బ్లాక్ టీమ్ మార్కు ఉంటే పదో తరగతి అయితే అడ్మిషన్ ఫీజు కింద రూ. 200, ఇంటర్ అయితే రూ.250లు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. లేని పక్షంలో పదో తరగతికి రూ.1150, ఇంటర్‌కు రూ.1,800లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కొత్తగా 11మందికి అడ్మిషన్లు చేయించగా మండలంలో ఇప్పటి వరకు 42 మంది అడ్మిషన్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు మేకల పల్లవి, సద్దల సుజిత్‌రెడ్డి, మండల ఇంజినీరు మహబూబ్ బాషా, ఈఓ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఓర్వకల్లు : ప్రశాంతంగా జీవిస్తున్న పల్లెల్లో పేకాట, మట్కా, అక్రమ సారా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని కర్నూలు తాలుకా సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని హుసేనాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. భూతగాదాలు, స్థలవివాదాలు వున్నప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ రాజారెడ్డి, గ్రామ పెద్దలు ఉన్నారు.

హమాలీ ఆత్మహత్య

కర్నూలు : కర్నూలు పాతబస్తీ మించిన్ బజార్‌లో నివాసముంటున్న ఉదయ్ కిరణ్ (31) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా ఆర్థిక పరిస్థితులు బాగలేక తీవ్ర ఒత్తిడికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్దిసేపు తర్వాత కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య స్వరూపారాణితో పాటు ఇద్దరు సంతానం. తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

గర్భస్త లింగనిర్ధారణ పరీక్షలు నేరం

కర్నూలు(హాస్పిటల్): గర్భస్త లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యానేరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, పీసీ పీఎన్‌డీటీ కర్నూలు డివిజన్ చైర్ పర్సన్ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో పీసీ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ సెంటర్స్ కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రామ్ ఆఫీసర్లు తనిఖీ చేసి వారి పత్రాలు అన్నీ సరిగ్గా ఉంటే వాటి ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి తదుపరి ఆమోదం కోసం సమర్పిస్తారన్నారు. సమావేశంలో పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రకాష్ ఆనంద్, గైనకాలజిస్టు డాక్టర్ నర్మద, డెమో ప్రమీలాదేవి, ఏపీపీ సుబ్బయ్య, ఎన్‌జీఓ రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి



బోల్తా పడిన ఆటో



మృతి చెందిన కుమ్మరి కృష్ణ

పాణ్యం : మండల పరిధిలోని ఆలమూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మణం చెందగా మరో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు కర్నూలు సంతోష్ నగర్‌కు చెందిన కుమ్మరి కృష్ణ(52), సునీత, అంజనమ్మ, లక్ష్మీదేవి సోమవారం ఆటోలో కొత్తూరులోని శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరారు. ఆలమూరు గ్రామం దాటగానే మలుపు వద్ద ఆటో ఒక్కసారిగా ముందు భాగం పైకి లేచింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, సునీత, అంజనమ్మ, లక్ష్మీదేవిలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది క్షతగాత్రులను పాణ్యం సీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిప కుమ్మరి కృష్ణను మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కొలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య కుమ్మరి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం.

వర్షం కోసం పూజలు



తుంగభద్ర నది నీటిని అమ్మవారి ఆలయానికి తీసుకు వచ్చిన భక్తులు

గూడూరు రూరల్: వర్షం కోసం నాగలాపురం సుంకులా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెంచికలపాడు గ్రామానికి చెందిన భక్తులు జి.సింగవరం సమీపంలోని తుంగభద్రనది నుంచి బిందెలతో నీటిని తెచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. 20 రోజులకు పైగా వర్షం లేక పంటలు ఎండిపోతున్నాయని, వరుణుడు కరుణించి వర్షాలను కురిపించాలని కోరుతూ అమ్మవారిని వేడుకున్నారు.

వేగంగా డ్రైనేజీ పనులు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ అచ్యుతానందరెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ ఏఈ అచ్యుతానందరెడ్డి తెలిపారు. సోమవారం డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎండీఎఫ్ నిధులతో రూ.5లక్షలతో 160 మీటర్ల డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల ఆవరణలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఒకేషనల్ కోర్సులు ప్రవేశ పెట్టాలని, అలాగే కళాశాలకు ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఉపేంద్ర, రంగస్వామి, మనోహర్, తేజ, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.